క్లుప్తంగా

శారదాపీఠాన్ని సందర్శించిన జీవీఎల్



స్వామీజీతో ముచ్చటిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

పెందుర్తి: రాజ్యసభ సభ్యుడు **జీవీఎల్ నరసింహారావు** విశాఖ శ్రీశారదాపీఠాన్ని ఆదివారం సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆశీసులు తీసుకున్నారు. ఇరువురు పలు అంశాలపై కాసేపు ముచ్చటించారు. ముందుగా పీఠ ప్రాంగణంలోని శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు, ఇతర దేవతామూర్తులకు జీవీఎల్ ప్రత్యేక పూజలు చేశారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు



ఆశీర్వచనం స్వీకరిస్తున్న జస్టిస్ రాజశేఖర్, జస్టిస్ సుబ్బారెడ్డి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.రాజశేఖర్, జస్టిస్ సుబ్బారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద న్యాయమూర్తులకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపికలను, శేషవస్త్రాలను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

160 మందికి వైద్య పరీక్షలు



గ్రంథాలయంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. మెడి కవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు తరుణ్, ధనుష్ 160 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, పారిశ్రామికవేత్త దాడి రమణచిట్టి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోక, ఆడారి రామకృష్ణ, పెంటకోట గణేష్, సూరిశెట్టి గణేష్, శరగడం అప్పారావు, రమణ, దేముడు, గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పాల్గొన్నారు.

రెండో రోజూ ఆందోళన

పరవాడ: ఫార్మా పరిశ్రమల వ్యర్థ రసాయనాల వల్ల పెద్ద చెరువులో మత్స్య సంపద నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు డిమాండ్ చేశారు. తుపాను సమయంలో ఫార్మా యాజమాన్యాలు ఇష్టానుసారంగా విడిచిపెట్టిన రసాయనాలతో పెద్ద చెరువులో భారీగా చేపలు మృతి చెందాయన్నారు. రైతులు చెరువు వద్ద చేపట్టిన ఆందోళనలో ఆదివారం సర్పంచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు. చెరువులో చేరిన వ్యర్థ రసాయనాలను శుభ్రం చేస్తామని ఇచ్చిన హామీని యాజమాన్యాలు గాలికి వదిలేశారన్నారు. నష్టపరిహారం పూర్తి స్థాయిలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అప్పలనాయుడు డిమాండ్ చేశారు. అనంతరం ఆయకట్టు రైతు సంఘ నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు , రైతులు సీఐ పి.ఈశ్వరరావుకు ఫిర్యాదు చేశారు.

పంట నష్టంపై నివేదిక

సబ్బవరం: గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులు మిచాంగ్ తుపాను ప్రభావంతో నీటి ముంపునకు గురైన వరి పంటను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. 240 ఎకరాల వరకూ నీట మునిగిన పంటలను గుర్తించారు. నీటి ముంపునకు గురైన పంట నష్టపోయిన నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. రాయితీపై విత్తనాలు అందజేయనున్నట్టు చెప్పారు.

ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు | అందుబాటులో మందులు | రోగులకు వసతులు | ఆహ్లాదకరంగా పరిసరాలు | రూ. 90లక్షలతో పీహెచ్‌సీలో సౌకర్యాలు | రూ.25 లక్షలతో వాడచీపురుపల్లిలో వసతులు

ప్రజారోగ్యానికి భరోసా





సుందరంగా తీర్చిదిద్దిన పరవాడ పీహెచ్‌సీ భవనం



ఆహ్లాదకర వాతావరణంలో పరవాడ పీహెచ్‌సీ



రక్త పరీక్షలు జరుపుతున్న ల్యాబ్ టెక్నీషియన్ బిందు



పరవాడ పీహెచ్‌సీలో రోగుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు



పరవాడ పీహెచ్‌సీలో పుష్కలంగా మందులు

పరవాడ: పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న ధృడ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసువచ్చారు. పరవాడ, వాడచీపురుపల్లి గ్రామాల్లో అరకొర వసతులతో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నాడు–నేడులో భాగంగా ప్రగతి బాట పట్టించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దారు. మరమ్మతులతో మూలుగుతున్న వాడచీపురుపల్లి పీహెచ్‌సీని రూ. 25 లక్షలతో అభివృద్ధి చేశారు.

చేపట్టిన పనులు ఇవీ

- పీహెచ్‌సీలో ఫ్లోరింగ్, విద్యుత్ సదుపాయం, టాయిలెట్స్, ప్లంబింగ్, వాహనాల కోసం నూతనంగా షెడ్డు ఏర్పాటు చేశారు.
- మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరిగింది. రోజుకు 40నుంచి 60 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు.
- రోగుల తాకిడి పెరగడంతో ప్రభుత్వం ఆస్పత్రి స్థాయి పెంచి 24/7 సేవలు అందుబాటులోకి తెచ్చింది.
- ఆస్పత్రి స్థాయి పెరగడంతో మరో వైద్యుడిని నియమించారు. గతంలో ఏదైన ప్రమాదం జరిగితే పరవాడ, గాజువాక ప్రాంతాల్లోని ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వచ్చేంది. ప్రస్తుతం ఆ పరిస్థితికి ప్రభుత్వం చెక్ పెట్టింది. రాత్రి వేళల్లో ఆస్పత్రిలో వైద్య సేవలు అందించేందుకు వీలుగా స్టాఫ్ నర్స్, ఇరువురు సిబ్బందిని ఏర్పాటు చేశారు.
- ఆస్పత్రి స్థాయి పెరిగిన తర్వాత వారానికి రెండు డెలివరీలు నిర్వహిస్తున్నారు.
- టీబీ లక్షణాలు కలిగిన రోగులకు కూడా వైద్య సేవలు అందిస్తున్నారు.

రూపు రేఖలు మారిన పరవాడ పీహెచ్‌సీ

పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.90 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటికే రూ.60 లక్షల ఖర్చు చేసి వసతులు కల్పించడంతో ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి.

- మొత్తం టైల్స్‌తో గచ్చులు నిర్మించారు. స్టోర్ రూం, ల్యాబ్ పరికరాలు సమకూర్చారు.
- గతంలో ఆస్పత్రికి వచ్చే రహదారి అధ్వానంగా ఉండేది. సీసీ రోడ్డు వేయడంతో రోగులకు అనేక విధాలుగా సౌకర్యంగా ఉంది.
- ఆస్పత్రిలో కొత్త టాయిలెట్స్, విద్యుత్ సదుపాయాలు, కొత్తగా ఫ్యానులు, ఏసీలు, వాష్ రూం, పెయింటింగ్‌లతో పాటు రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. రోజుకు 140 నుంచి150 మంది వైద్య సేవలు పొందడానికి వస్తున్నారు.

> ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం... విద్య అందించడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని మేధావుల మాట. వారి మాటను స్ఫూర్తిగా తీసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారు. ప్రజారోగ్యానికి భరోసా కల్పించారు. నాడు– నేడు ద్వారా ఆస్పత్రుల రూపు రేఖలు మార్చారు. అవసరమైన సౌకర్యాలతో పాటు వైద్యులు, సిబ్బందిని నియమించారు.నాణ్యమైన మందులతో పాటు రక్త పరీక్షలు కూడా ఉచితంగా చేస్తూ వైద్యం అందిస్తున్నారు.

స్థాయి పెంచడంతో అదనపు సేవలు



వాడచీపురుపల్లి పరిసర గ్రామాల్లో వేలాది మంది ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒక్కటే పెద్దదిక్కు. గతంలో పగటి పూట మాత్రమే పనిచేయడం వల్ల అత్యవసర సమయాల్లో చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం . ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆస్పత్రి స్థాయి పెంచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. వాడచీపురుపల్లి ఆస్పత్రి స్థాయి పెంచడం వల్ల 24 గంటలూ సేవలు అందుతున్నాయి.

– కూంద్రపు సోమునాయుడు, వాడచీపురుపల్లి

పట్నానికి వెళ్లే బాధ తప్పింది



ఏ చిన్న రోగమొచ్చినా దూర ప్రాంతంలో ఉన్న విశాఖ, గాజువాక, అనకాపల్లిలోని ఆస్పత్రులకు వైద్యం కోసం వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ శ్రమ తప్పింది. పరవాడలో అన్ని సదుపాయాలతో కూడిన ప్రభుత్వ ఆస్పత్రి ఉండడంతో మెరుగైన వైద్యం అందుతుంది. వ్యయ ప్రయాసలు కూడా తప్పాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో షుగర్, బీపీ వంటి రోగాలకు అవసరమైన అన్ని మందులు దొరుకుతున్నాయి. వైద్యులు కూడ అందుబాటులో ఉంటున్నారు.

– మాకిరెడ్డి రమణమ్మ, వెన్నలపాలెం

ఓపీ సంఖ్య పెరిగింది



వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు మెరుగు పర్చడంతో రోజు వారీ వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. రోగులకు వసతులతో పాటు మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.ఆస్పత్రి స్థాయి పెంచడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీలో రోగులకు మంచి సేవలు అందిస్తున్నాం.

– కనకఅప్పారావు, ప్రభుత్వ వైద్యుడు, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ

మాజీ ఎమ్మెల్యే ‘పైల’ సేవలు ఎనలేనివి



దివంగత మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్, నేతలు

పరవాడ: దివంగత మాజీ ఎమ్మెల్యే పైల అప్పలనాయుడు నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కొనియాడారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పైల అప్పలనాయుడు 19 వర్ధంతిని పరవాడ సంతబయలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్, అనకాపల్లి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ దివంగత మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జయరామ్, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, సర్పంచ్‌లు వరలక్ష్మిసీతారామయ్య, గొర్లిగోపి అమ్మలు, పల్లా అప్పలరావు నాగమణి, పెదిశెట్టి పూజాశేఖర్, బండారు కల్పన రాజశేఖర్ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకముందు పైల యువసేన ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రోగులకు, బాలికల వసతి గృహ విద్యార్థులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

సత్యసాయి సేవలు స్ఫూర్తిదాయకం



పూజల్లో పాల్గొన్న విశ్వనాథనాయుడు తదితరులు

పెందుర్తి: భగవాన్ సత్యసాయి ప్రపంచానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని మాజీ జెడ్పీటీసీ కంచిపాటి విశ్వనాథనాయుడు అన్నారు. సుజాతనగర్‌లోని భగవాన్ సత్యసాయి భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం చినముషిడివాడలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. సత్యసాయి కీర్తనలతో ఆరాధన చేశారు. పేదలకు విశ్వనాథనాయుడు, సింహచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు చేతుల మీదుగా వస్త్రదానం చేశారు. అనంతరం సామూహిక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు జ్యోతి, ముక్క గోపి, పి.తాతారావు, సీతారాం, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలకు మార్గదర్శకుడు ‘కట్టమంచి’



ఆచార్య కె.ఎస్.చలం రచించిన వలస నాటకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మహారాణిపేట : సాహిత్య రంగంలో సరికొత్త భావాలకు, నూతన ఆలోచనా రీతులకు మార్గదర్శకులుగా నిలిచిన వ్యక్తి కట్టమంచి రామలింగారెడ్డి అని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సాయంత్రం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో అరసం, ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్టు సంయుక్త నిర్వహణలో డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్యం–విమర్శ అంశంపై జరిగిన సాహిత్య సభలో ఆచార్య కె.ఎస్.చలం, ఆచార్య చందు సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న పాల్గొని మాట్లాడారు. ఒక వైపు తెలుగు కవితను మరో వైపు కవితా విమర్శను నూతన శోభతో కొత్త కాంతులతో ఆవిష్కరించిన సాహితీమూర్తి కట్టమంచి అని, సంభాషణలతో దెబ్బకు దెబ్బ తీయగల నేర్పు, వాదనా చాతుర్యం ఆయన శైలి అన్నారు. హాస్య ప్రియత్వం, ఛలోక్తులు, చమత్కార సంభాషణ నైపుణ్యం వంటి లక్షణాలతో రామలింగారెడ్డి అందరినీ ఆకట్టుకునేవారు అని కొనియాడారు. సాహితీవేత్తగా, వక్తగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా, రాజనీతిజ్ఞుడిగా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేశారని గుర్తు చేశారు. శత వసంతాల తెలుగు సాహిత్య ప్రస్థానం గురించి ఆలోచించేటప్పుడు మొట్ట మొదట మెదిలే కొద్ది మంది వైతాళికుల్లో కట్టమంచి రామలింగారెడ్డి ఒకరని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విశాఖలో నెలకొల్పడంలో కట్టమంచి విశేష కృషి చేశారన్నారు. ఆచార్య కె.ఎస్.చలం రచించిన వలస నాటకం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మేనేజర్ పి.ఎ.రాజు, బండి సత్యనారాయణ, అడపా రామకృష్ణ, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న నందీశ్వరుడు

పెందుర్తి: కార్తీక త్రయోదశిని పురస్కరించుకుని సుజాతనగర్‌లోని హరిహర క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. నందీశ్వరునికి భక్తులు విశేష అభిషేకాలు చేశారు. ముందుగా మహాశివునికి పూజలు నిర్వహించారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: గ్రేట్ థాట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరాన్ని కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ ఒకరు దానం చేసిన రక్తంతో దాదాపు ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో గ్రేట్ థాట్స్ సంస్థ ప్రతినిధులు లీలా గంగాధర్, రవి, రాంబాబు, సాంబశివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భూలోకమ్మ పండగ



అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించడానికి ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

సబ్బవరం:మండలంలోని అంతకాపల్లి గ్రామంలో కొలువైన శ్రీభూలోకమాంబ అమ్మవారి పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు భారీ ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, ఉప సర్పంచ్ గొర్లి అప్పలనాయుడు,మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు, కొల్లి దాసు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా బ్రాహ్మణుల కార్తీక సమారాధన



సామూహిక కుంకుమార్చనలో బ్రాహ్మణ మహిళలు

సింహాచలం: సింహాచలం ప్రాంతానికి చెందిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన శ్రీ కృష్ణాపురంలోని కాశీరాము తోటలో ఆదివారం ఘనంగా జరిగింది. వేదికపై పరమేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేశారు. చిన్నారులు, మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు.పెద్ద ఎత్తున బ్రాహ్మణ కుటుంబాలు కార్తీక వన సమారాధనకు తరలివచ్చారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వడ్లమాని శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా ఎ.ఫణీంద్రశర్మ, కార్యదర్శిగా కొల్లూరి సుబ్బారావు, కోశాధికారిగా టి.జగన్నాథం, ముఖ్య సలహాదారుగా ఎంఎల్.నరసింహ ఎన్నికయ్యారు.

అ‘పూర్వ’ కలయిక



జుత్తాడలో కలిసిన 1986 బ్యాచ్ విద్యార్థులు

పెందుర్తి: వారు దాదాపు 37 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నారు. కొందరు ఫారిన్‌లో.. ఇంకొందరు ఇతర రాష్ట్రాల్లో.. మరికొందరు అధికారులుగా.. వ్యాపారస్తులుగా స్థిరపడ్డారు. వారంతా ఆదివారం కలిసి సందడి చేశారు. చోడవరం పాతశాలలో1986 పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా పెందుర్తి మండలం జుత్తాడలోని ఓ రిసార్ట్‌లో కలిశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆడిపాడి సందడి చేశారు. హైదరాబాద్‌లో స్థిరపడిన ఆనాటి గురువు జగన్నాథరావు మాస్టారును ఇక్కడకు రప్పించి ఘనంగా సత్కరించి ఆశీసులు తీసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఎన్నో మధురమైన జ్ఞాపకాలను మూటకట్టుకుని తిరుగుపయణమయ్యారు.

కేంద్రం దిగి రావాల్సిందే..



దీక్షలో పాల్గొన్న కార్మికులు

కూర్మన్నపాలెం : ఉక్కు కార్మికులు తమ జీవితాల కోసం చేస్తున్న పోరాటానికి ఎదురుండదని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1,032వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఉద్యోగ విరమణ చేసిన జవాన్‌కు సత్కారం



ఉద్యోగ విరమణ చేసిన ఆర్మీ జవాన్ దంపతులను సత్కరిస్తున్న స్నేహితులు

సబ్బవరం: రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమతో చదువుకుని భారత సైన్యంలో ఆర్మీ జవాన్‌గా ఉద్యోగ విరమణ చేయడంతో ఘనంగా సత్కరించారు.1998–99 విద్యా సంవత్సరంలో రావలమ్మపాలెం పాఠశాలలో పదో తరగతి చదువుకున్న వీరంతా ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితుడు కొటాన తమ్మునాయుడు దంపతులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సబ్బవరపు రామకృష్ణ,సబ్బవరపు నరసింహమూర్తి,శ్రీరంరెడ్డి రామకృష్ణ,బైలపూడి రమణ,గొర్లి ప్రసాద్,గొంప రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.